# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆరోగ్య సంరక్షణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు ఎనలేనివని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కొనియాడారు.
- విశాఖ జిల్లాలో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామివారు కొలువుదీరిన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యింది.
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది.
- మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి కింజరాపు అచ్చెనాయుడు అన్నారు.
- ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి /పశ్చిమ గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

==========================

రక్తదానం, ప్రథమ చికిత్స, విపత్తు నిర్వహణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు ఎనలేనివని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈరోజు జరిగిన రెడ్ క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశంలో గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన పలు జిల్లాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలకు అవార్డులను ఆయన ప్రదానం చేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.... ఇటీవల గోదావరి, కృష్ణ నదుల వరదల సమయంలో బాధితులకు సేవలు అందించడంలో, వనరులను సమీకరించడంలో రెడ్ క్రాస్ వాలంటీర్లు చేసిన కృషి అభినందనీయమన్నారు. తలసేమియా రక్త మార్పిడి కేంద్రాల వంటి కార్యక్రమాలను, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులతో పాటు విస్తరించాలని గవర్నర్ ఆకాంక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న పేద పిల్లలకు ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి రావాలని గవర్నర్ పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. జలవనరుల శాఖలో 71 పనులకు కేబినెట్ ఆమోదం లభించింది. రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ సమావేశ వివరాలను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వివరిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

==========================

విశాఖ జిల్లాలో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామివారు కొలువుదీరిన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యింది. మధ్యాహ్నం 2 గంటలకు తొలి పావంచ వద్ద స్వామి వారి పుష్ప రథాన్ని సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త అయిన పూసపాటి అశోక్ గజపతి రాజు జెండా ఊపి ప్రారంభించారు. లక్షలాది మంది భక్తులు ఈ గిరి ప్రదక్షిణకు బయలుదేరి వెళుతున్నారు. తొలి పావంచ నుండి అడవివరం, హనుమంతవాక, విశాలక్షినగర్, ఎంవీపీ, సీతమ్మధార, కంచరపాలెం, గోపాలపట్నం సహా పలు ప్రాంతాల మీదుగా సుమారు 32 కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ జరుగుతుంది. భక్తుల సౌకర్యార్థం కొండచుట్టు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సంవత్సరం సుమారుగా 10 లక్షల మంది భక్తులు పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా ఈరోజు నుంచి రేపు సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు సభ్యులు శ్రీ భరత్, శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, గణబాబు తదితరులు పాల్గొన్నారు.

==========================

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేసే ఎరువుల కేటాయింపులలో ఎటువంటి కోత విధించలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు ఢిల్లీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఖరీఫ్ సీజనుకు 16.76 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు కేటాయించగా జూన్ నెల ఆఖరు నాటికి 5.64 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. వీటిని ప్రైవేటు, సహకార సంస్థల ద్వారా రైతులకు అందిస్తున్నామని వెల్లడించారు. పెరుగుతున్న జనాభా ఆహార అవసరాలు తీర్చే విధంగా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసే ఉద్దేశంతో అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

విరామం

==========================

మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెనాయుడు అన్నారు. ఈరోజు అమరావతిలో పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ... మామిడి దిగుబడి ఎక్కువగా ఉండటం వల్ల రైతులకు ధర విషయంలో ఇబ్బంది కలుగకుండా ముందుగానే చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత సంవత్సరం తోతాపురి మామిడి ఉత్పత్తి 2.5 లక్షల మెట్రిక టన్నులు కాగా, ఈ ఏడాది 6.5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. దిగుబడి ఎక్కువగా ఉండటం వల్ల రైతులకు ధర విషయంలో ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నెల రోజుల క్రితమే ప్రభుత్వం వైపు నుంచి మామిడి పంటకు మద్ధతు ధర ప్రకటించామని తెలిపారు. కిలోకి 4 రూపాయలు చొప్పున ప్రభుత్వం ఇస్తోందని, దీనికి తోడు 8 రూపాయలకు తగ్గకుండా పల్ప్ ఫ్యాక్టరీలు, ట్రేడర్లు కొనుగోలు చేసేలా చూస్తున్నామన్నారు. మొత్తంగా మామిడి రైతులకు కనీసం కిలోకి 12 రూపాయలు వచ్చేలా చర్యలు చేపట్టమని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

============================

శాసనసభ్యుల, శాసనమండలి సభ్యుల నివాస సముదాయాలు డిసెంబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాస సముదాయాలను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని వినూత్నంగా నివాస సముదాయాలను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ క్వార్టర్లలో ఆధునిక సౌకర్యాలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, సోలార్ ఎనర్జీ వినియోగం, గ్రౌండ్ వాటర్ రీచార్జ్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో మెరుగైన వసతులు కల్పించాలని వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

============================

గంగా పరివాహక పశ్చిమ బెంగాల్, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. జార్ఖండ్, ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల మీదుగా ద్రోణి విస్తరించి ఉందని, అలాగే ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి /పశ్చిమ గాలులు వీస్తున్నాయని పేర్కొంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో రాగల 24 గంటలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది.

============================

============================